

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365


WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...


రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777

రంగారెడ్డి శనివారం 11-04-2026 సంపుటి: 01 సంచిక : 295 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Saturday 11-04-2026 Volume :01 Issue: 295 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani

# అమెరికాతో ఆటలొద్దు



- ఇరాన్‌కు జేడీ వాన్స్ తీవ్ర హెచ్చరిక.
- ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్-అమెరికా శాంతి చర్చలు.
- విశ్వసనీయతతో ఉండాలి, లేదంటే పరిణామాలు తీవ్రం: వాన్స్.
- పాకిస్థాన్ ప్రధాని మధ్యవర్తిత్వంలో దౌత్యపరమైన చర్చలు.
- ట్రంప్ ఆదేశాలతో రంగంలోకి వాన్స్, కుష్నర్ బృందం.

న్యూఢిల్లీ

అమెరికాతో ఆటలు ఆడాలనుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇరాన్‌ను హెచ్చరించారు. పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించినందున శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లే ముందు వాన్స్ మీడియాతో మాట్లాడుతూ అమెరికా వైఖరిని స్పష్టం చేశారు. తమ అధ్యక్షుడి ఆదేశాల మేరకు దౌత్యపరమైన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, ఈ సమయంలో ఇరాన్ తమతో

-మిగతా 2 లో



## బెంగాల్ ఓటర్లకు బీజేపీ తాయిలాలు

- మహిళలు, నిరుద్యోగులకు నెలకు రూ. 3,000 సాయం
- ఎన్నికల మ్యానిఫెస్టోలో బీజేపీ భారీగా ఉచిత హామీలు

న్యూఢిల్లీ,

ఉచితాలకు తాము వ్యతిరేకమని చెప్పుకొనే భారతీయ జనతా పార్టీ పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు భారీగా తాయిలాలు ప్రకటించింది. ప్రతి మహిళ, నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయాన్ని అందచేస్తామని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోపు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 7వ వేతన సంఘాన్ని నియమిస్తామని హామీ ఇవ్వడంతోపాటు చొరబాటుదారుల పట్ల కఠిన వైఖరిని అవలంబిస్తామని వాగ్దానం చేసింది.పోలీసు శాఖసహా అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కూడా బీజేపీ హామీ ఇచ్చింది.

-మిగతా 2 లో

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై
# కాంగ్రెస్ ఫోకస్

### మహిళా బిల్లు, డిలిమిటేషన్ అంశాలపై చర్చ


- ఈ రెండు అంశాలపై కాంగ్రెస్ సుదీర్ఘ కసరత్తు
- రాజకీయ లబ్ధికోసంమే ప్రత్యేక సమావేశాలన్న ఖర్గే
- తెలంగాణలో డీలిమిటేషన్ ను రేవంత్ నివేదిక సమర్పణ

న్యూఢిల్లీ ఏప్రిల్ 10 నేటి దర్శిని)

జాతీయ రాజకీయాల్లో రాబోయే మార్పులు, కేంద్ర ప్రభుత్వ వ్యూహాలను తిప్పికొట్టే దిశగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం సమాలోచనలు చేసింది. ముఖ్యంగా పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. మహిళా బిల్లు, సీట్లు పెంపుదల వంటి రెండు అంశాలపై వ్యూహాత్మకంగా ఉండాలని నిర్ణయించారు. దేశ రాజధాని ఢిల్లీ ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీసమావేశం అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ప్రధాన ప్రతిపక్షంగా అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించేందుకు ఈ భేటీని ఏర్పాటు చేసినట్లు సమాచారం.

-మిగతా 2 లో





## వైభవ్ దెబ్బ..
# ఆర్సీబీ అబ్బా

### హేజిల్‌వుడ్‌ను కూడా వదల్లేదుగా..!

- ఐపీఎల్ 2026లో ఆర్సీబీకి తొలి ఓటమి
- ఆర్ఆర్ చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం
- వరుసగా నాలుగో విజయం సాధించిన ఆర్ఆర్

న్యూఢిల్లీ ఏప్రిల్ 10 నేటి దర్శిని)

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ హవా కొనసాగుతోంది. ఈ సీజన్‌లో రెండోసారి అతడు 15 బంతుల్లో హాఫ్ సెంచరీ స్కోరు చేశాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో శుక్రవారం జరిగిన మ్యాచులు ఈ చిచ్చరపిడుగు విధ్వంసం సృష్టించాడు. 26 బంతుల్లో ఏకంగా 78 పరుగులు చేశాడు. హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ లాంటి బౌలింగ్‌లోనూ ఊచకోత కోశాడు. దీంతో ఈ టోర్నీలో ఆర్ఆర్ వరుసగా నాలుగో విజయాన్ని సాధించింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.ఐపీఎల్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్

-మిగతా 2 లో




## నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

- పటిష్టమైన భద్రత నడుమ పాకిస్తాన్ రాజధాని
- నగరంలో రెడ్ అలర్ట్ ప్రకటన
- భారీగా బందోబస్తు ఏర్పాటు

ఇస్లామాబాద్

అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు అంగీకరించినా.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మాత్రం తొలగిపోలేదు. సీజ్‌ఫైర్ వేళ.. శాంతి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇస్తోంది. ఏప్రిల్ 11న శనివారం రాజధాని ఇస్లామాబాద్‌లో ఈ చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ హై అలర్ట్‌లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వ భవనాలు, కీలక రహదారి మార్గాల వద్ద భద్రతా బలగాలు పహారా కాస్తున్నాయి. రాజధానిలోని రెడ్‌జోన్ చుట్టూ కట్టుదిట్టమైన భద్రత కొనసాగుతోంది. అక్కడ పరిమిత సంఖ్యలోనే జనసంచారం కనిపిస్తోంది. ఇస్లామాబాద్‌లో దేశ పార్లమెంట్, కీలక ప్రభుత్వ కార్యాలయాలు, లగ్జరీ హోటళ్లు, ఎంబసీలు, విదేశీ సంస్థల కార్యాలయాలున్న ప్రాంతాన్ని రెడ్‌జోన్‌గా పిలుస్తారు. ఈ చర్చల నేపథ్యంలో గురువారం, శుక్రవారం ఇస్లామాబాద్‌లో సెలవు

-మిగతా 2 లో



## వివాదంలో మోనాలిసా పెళ్లి

- పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు
- భర్తపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు


2

## టోల్ ప్లాజాల వద్ద ఇక నో క్యాష్ పేమెంట్స్

- అమల్లోకి కొత్త నిబంధనలు



2



## కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

- ఇప్పుడే రిపేర్లు చేయడంలో ఆంతర్యం ఏమిటో
- గతంలోనే చేసివుంటే రైతులకు మేలు జరిగేది కదా
- కేవలం కమిషన్ల కోసమేనేమో అన్న అనుమానాలు
- రియల్ ఎస్టేట్ కోసమే ఫ్యూచర్ సిటీ జపం
- జిహెచ్ఎంసిలో తీవ్ర అవినీతి జరుగుతోంది
- మీడియా సమావేశంలో జాగృతి అధ్యక్షురాలు కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 10 నేటి దర్శిని)

కాళేశ్వరాన్ని వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. రెండున్నరేళ్లు దారుణంగా వ్యవహరించి పంటలు ఎండబెట్టారని ఆరోపించారు. ఇప్పటికే ఈ న ఇర్ణయం తీసుకుని ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేదని అన్నారు. హైదరాబాద్‌లో కవిత మీడియాతో మాట్లాడుతూ..కమిషన్ల కోసమే ఇప్పుడు

-మిగతా 2 లో




## నేడు లేదా రేపు ఇంటర్ ఫలితాలు

- ప్రథమ , ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి
- రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరు

హైదరాబాద్, ఏప్రిల్ 10 నేటి దర్శిని)

తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడనుంది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, రాష్ట్ర విద్యాశాఖ ఏప్రిల్ 12న ఆదివారం ఫలితాలను వెల్లడించేందుకు రంగం సిద్ధం చేసినప్పటికీ, పలు జాతీయ స్థాయి నివేదికల ప్రకారం ఒక రోజు ముందే అంటే ఏప్రిల్ 11న శనివారం కూడా ఫలితాలు వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

-మిగతా 2 లో

## 20న బీఆర్ఎస్‌లోకి
# జీవన్‌రెడ్డి

### జగిత్యాలలో భారీ బహిరంగసభ

- ముఖ్యఅతిథిగా రావాలంటూ కేసీఆర్‌కు జీవన్‌రెడ్డి విజ్ఞప్తి
- ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో భేటీ
- మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే పంపాడన్న మాజీమంత్రి
- ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని పలకించిన కెసిఆర్

మర్కుక్ ఏప్రిల్ 10 నేటి దర్శిని)

మాజీమంత్రి టి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడానికి ముహూర్తం ఖరారైంది. ఈనెల 20న ఆయన గులాబీ తీర్థం పుచ్చుకోనున్నారు. అదేరోజు జగిత్యాలలో భారీ బహిరంగ సభను నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ భావిస్తున్నది. శుక్రవారం హైదరాబాద్ ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలిశారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఉన్న ఈ ఇద్దరు నేతలు, తాజా పరిణామాల నేపథ్యంలో అత్యంత ఆత్మీయంగా కలుసుకున్నారు.

-మిగతా 2 లో

BHARAT RASHTRA SAMITHI
BRS
భారత రాష్ట్ర సమితి



## పామునైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత

2



# అమెరికాతో ఆటలొద్దు

మొదటి తరువాయి

ఆటలు ఆడాలని చూస్తే సహించబోమని వాన్స్ స్పష్టం చేశారు.ఆరు వారాలుగా క్షిపణుల మోతతో అట్టుడికిన పశ్చిమాసియాలో యుద్ధానికి విరామం ప్రకటించిన అమెరికా టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చలకు సిద్ధమైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, ఉన్నత స్థాయి బృందంతో కలిసి శుక్రవారం పాకిస్థాన్ బయల్దేరారు. టెహ్రాన్‌తో చర్చల కోసం మేము సిద్ధంగా ఉన్నాం. ఇరుదేశాల మధ్య శాంతి చర్చలు సానుకూలంగా జరుగుతాయని ఆశిస్తున్నాను అని పాకిస్థాన్‌కు వెళ్లడానికి ముందు వాన్స్ పేర్కొన్నారు.టెహ్రాన్‌తో దౌత్యపరమైన చర్చల విషయమై అధ్యక్షుడు ట్రంప్ మాకు కీలకమైన సూచనలు చేశారు. ఆయన మాట ప్రకారం ఇరాన్ విశ్వసనీయతతో చర్చలు జరిపితే మేము సానుకూలంగా స్పందిస్తాం. అలా కాకుండా వారు మాతో ఆటలు ఆడాలనుకుంటే మాత్రం చర్చలకు వచ్చిన బృందం వారి మాట అస్సలు వినదు. అయితే.. మేము మాత్రం ఇరుదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు సానుకూలంగా జరగడానికి ప్రయత్నిస్తాం' అని వాన్స్ వెల్లడించారు. అమెరికా, టెహ్రాన్ మధ్య ఇస్లామాబాద్ వేదికగా దౌత్యపరమైన చర్చలకు చాలా ప్రాధాన్యం ఉంది. వాన్స్‌తో పాటు స్టీవ్ విట్‌కాఫ్, జేర్డ్ కుష్నర్‌లతో కూడిన బృందం పాక్ ప్రధాని మధ్యవర్తిత్వంలో టెహ్రాన్ ప్రతినిధులుతో చర్చలు జరుపనుంది.

# బెంగాల్ ఓటర్లకు బీజేపీ తాయిలాలు

మొదటి తరువాయి

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం సంకల్ప్ పత్ర పేరిట బీజేపీ శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేసింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మ్యానిఫెస్టో విడుదల చేస్తూ ఇది సోనార్ బంగ్లా నిర్మాణం కోసం రోడ్డుమ్యాపుగా అభివర్ణించారు.

# నేడు ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలు

మొదటి తరువాయి

ప్రకటించారు. దుకాణాలు మూతపడ్డాయి. తమ మధ్యవర్తిత్వంతోనే రెండు వారాల పాటు కాల్పుల విరమణ జరిగిందని చెప్పిన పాకిస్థాన్ .. ఇప్పుడు ఇరుదేశాల మధ్య శాంతిచర్చలకు ఆతిథ్యం ఇస్తోంది. ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నేతృత్వంలోని బృందం అమెరికా తరఫున చర్చల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఇక ఇరాన్ వైపు నుంచి విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ పాక్ బయల్దేరారంటూ అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ వార్తలను ఇరాన్ ఖండించింది. వారిద్దరూ తమ రాజధాని టెహ్రాన్‌లోనే ఉన్నారని చెప్పింది. ఒకవేళ చర్చలంటూ జరిగితే.. హర్మూజ్‌పై నియంత్రణ, తమ దేశంపై ఉన్న ఆంక్షల నుంచి ఉపశమనం, తన మిత్రపక్షాలపై దాడులు చేయకూడదంటూ 10 పాయింట్ల డిమాండ్ల పైనే ఇరాన్ పట్టుబట్టే అవకాశం ఉంది. ఇక, లెబనాన్‌లోని ఇరాన్ మిత్రపక్షం హెజ్‌బొల్లా గ్రూప్‌పై ఇజ్రాయెల్ దాడులు మాత్రం ఆగడం లేదు. సీజ్‌ఫైర్ ప్రకటన తర్వాతే అక్కడ మారణహోమం సృష్టించింది. అమెరికా–ఇరాన్ మధ్య ఉన్న అపనమ్మకం, ఇజ్రాయెల్ దూకుడు కారణంగా ఈ చర్చల్లో పురోగతిని ఆశించలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# వైభవ్ దెబ్బ.. ఆర్సీబీ అబ్బా

మొదటి తరువాయి

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఇదే తొలి ఓటమి కావడం గమనార్హం. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్‌కు వైభవ్ సూర్యవంశీ మెరుపు ఆరంభాన్ని అందించాడు. వైభవ్ సూర్యవంశీ (26 బంతుల్లో 78 రన్స్), ధ్రువ్ జురెల్ (43 బంతుల్లో 81 రన్స్) రాణించడంతో పవర్ ప్లే ముగిసే సరికి 97/1తో నిలిచి విజయాన్ని ఖరారు చేసుకుంది. వైభవ్ సూర్యవంశీ పవర్ ప్లే ముగిసే సరికే 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి.. ఆర్సీబీ నుంచి మ్యాచ్ లాగేశాడు.వైభవ్ ఔట్ అయిన కాసేపటికే హిట్‌మెయర్ (0), రియాన్ పరాగ్ (3) పెవిలియన్ చేరినా.. రవీంద్ర జడేజా సాధికారికంగా బ్యాటింగ్ చేశాడు. జురెల్‌తో కలిసి అబేధ్యమైన ఐదో వికెట్‌కు 50 బంతుల్లో 68 రన్స్ జోడించాడు. 25 బంతుల్లో 24 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఈ మ్యాచులో ఆర్‌ఆర్ 4 వికెట్లు కోల్పోయి 18 ఓవర్లలో మ్యాచ్ ముగించింది. టోర్నీలో వరుసగా నాలుగో విజయాన్ని నమోదు చేసింది. పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకుంది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. ఓ దశలో 2.5 ఓవర్లలో 45/1తో భారీ స్కోరుపై కన్నేసింది. ఆ తర్వాత 94/6, 125/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. కానీ చివర్లో కెప్టెన్ రజత్ పటీదార్ (40 బంతుల్లో 63 రన్స్), ఇంపాక్ట్ ప్లేయర్ వెంకటేశ్ అయ్యర్ (15 బంతుల్లో 29 రన్స్) సత్తాచాటడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 201 రన్స్ స్కోరు చేసింది.

# నేడు లేదా రేపు ఇంటర్ ఫలితాలు

మొదటి తరువాయి

ఈ ఏడాది ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు జరిగిన వార్షిక పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 9.9 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రథమ , ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఒకేసారి విడుదల చేసేందుకు బోర్డు అన్ని కసరత్తులు పూర్తి చేసింది. విద్యార్థులు తమ ఫలితాలను విడుదలైన వెంటనే అధికారిక వెబ్‌సైట్లలో హాల్ టికెట్ నంబర్‌ను నమోదు చేసి మార్కుల మెమోను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

## పామునైనా నమ్మొచ్చు కాని బీజేపీని నమ్మలేం : మమత



**కోల్‌కతా,ఏప్రిల్ 10**

ఈశాన్య రాష్ట్రాల ప్రజల నుంచి ఓట్లను సాధించగలమన్న నమ్మకం కోల్పోయినందునే బీజేపీ అస్సాం ఎన్నికల కోసం వెలుపల నుంచి ప్రజలను తీసుకువచ్చిందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ శుక్రవారం ఆరోపించారు.ఉత్తర 24 పరగణాల జిల్లాలోని తెంతులియా వద్ద ఓ ఎన్నికల ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కింద దేశంలోని అన్ని దర్యాప్తు సంస్థలు నిష్పాక్షితను కోల్పోయాయని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను బీజేపీ కొనేసిందంటూ ఆమె ఆరోపించారు. ఉత్తర్ ప్రదేశ్ నుంచి ఓ రైలు నిండా 50,000 మందిని అస్సాంకు తీసుకువచ్చారు అని ఆమె ఆరోపించారు. పామునైనా నమ్మొచ్చునేమో కాని బీజేపీని మాత్రం కాదని ఆమె విమర్శించారు.

# పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై కాంగ్రెస్ ఫోకస్


మొదటి తరువాయి



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఈ కీలక సమావేశం ప్రారంభమైంది. ఈ భేటీకి కాంగ్రెస్ పార్టీకి చెందిన అగ్రనేతలు, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా సోనియా గాంధీ, సీనియర్ నేత పి. చిదంబరం వర్చువల్‌గా పాల్గొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సల్మాన్ ఖుర్షీద్, అంబికా సోనీ, సచిన్ పైలట్, భూపేశ్ బగేల్ తదితరులు ప్రత్యక్షంగా హాజరయ్యారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఈ సమావేశంలో పాల్గొని తమ రాష్ట్రాల నివేదికలను సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ప్రకటించిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రధానంగా ఈ క్రింది అంశాలపై తన వాణిని వినిపించాలని నిర్ణయించింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుపై కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన వైఖరిని ఖరారు చేయనుంది. ఓబీసీ మహిళలకు ఉప కోటా కల్పించాలనే డిమాండ్‌పై కూడా చర్చించారు. 2026 తర్వాత జరగనున్న నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై సీఎంలు రేవంత్ రెడ్డి, సిద్ధరామయ్య తమ వాదనలు వినిపించారు. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్తతలు, భారతదేశంపై వాటి ప్రభావం, భారత్ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై చర్చించారు. కేవలం మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం తీసుకురాబోయే బిల్లులను ఎలా అడ్డుకోవాలి లేదా చర్చలో ఎలా పైచేయి సాధించాలనే అంశంపై సభ్యులకు కాంగ్రెస్ అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నరేంద్రమోదీ ప్రభుత్వం అనూహ్యంగా ప్రత్యేక సమావేశాలను పిలవడంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా తెలంగాణ వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ బలోపేతంపై సీఎం రేవంత్‌రెడ్డి సీడబ్ల్యూసీ సమావేశంలో కీలక ప్రసంగం చేసే అవకాశం ఉంది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు ఎన్నికల ప్రయోజనాల కోసమేనని చెప్పారు. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి అధికారికంగా ఎటువంటి ప్రతిపాదన కాంగ్రెస్ ముందుకు రాలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలోనే మహిళా రిజర్వేషన్లపై స్పష్టతని ఇచ్చామని, కేంద్రాన్ని డిమాండ్ కూడా చేశామని ప్రస్తావించారు. వెస్ట్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలు జరుగుతున్న వేళ హఠాత్తుగా మహిళా రిజర్వేషన్ల బిల్లు సవరణ , పునర్విభజన చట్టం సవరణ బిల్లులను తెరపైకి తీసుకువచ్చారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక అఖిలపక్ష సమావేశం పెట్టాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీలన్నీ కోరాయని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం తమ ప్రయోజనాల కోసం ప్రయత్నం చేస్తుందని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

# వివాదంలో మోనాలిసా పెళ్లి

**-పెళ్లినాటికి ఆమె మైనర్ అని గుర్తింపు**
**-భర్తపై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు**



**లక్నో,**

కుంభమేళాలో ఒక్క ఫోటోతో రాత్రికి రాత్రే సోషల్ మీడియా స్టార్‌గా మారిన గిరిజన యువతి మోనాలిసా ఇప్పుడు తీవ్ర వివాదంలో చిక్కుకుంది. ఆమె ప్రేమ వివాహం చట్టపరమైన సమస్యల్లో పడడంతో చర్చనీయాంశంగా మారింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన మోనాలిసా, అనంతరం ఫర్మన్ ఖాన్ అనే వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. అయితే ఈ పెళ్లి చట్టబద్ధతపై అనుమానాలు వ్యక్తమవడంతో విచారణ ప్రారంభమైంది.జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టగా, అసలు విషయం మోనాలిసా మైనర్ అని తేలింది. మహేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రి రికార్డుల ప్రకారం మోనాలిసా 2009 డిసెంబర్ 30న జన్మించినట్లు తేలింది. అంటే 2026 మార్చిలో వివాహం జరిగే సమయానికి ఆమె వయస్సు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే. వివాహానికి కనీస వయస్సు లేకపోవడంతో, ఆమె భర్తపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మరో సంచలన అంశం కూడా బయటపడింది. పెళ్లి జరిపించేందుకు మోనాలిసా పుట్టిన తేదీని మారుస్తూ నకిలీ ధృవీకరణ పత్రాలు సృష్టించినట్లు దర్యాప్తులో తేలింది. 2008లో పుట్టినట్లు చూపిస్తూ తప్పుడు సర్టిఫికెట్ల ఆధారంగా కేరళలోని ఆలయంలో వివాహం నిర్వహించినట్లు అధికారులు గుర్తించారు.ఈ వ్యవహారంలో కొన్ని సంస్థల ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది సాధారణ ప్రేమ వివాహం కాదని, ముందస్తుగా ప్రణాళికాబద్ధంగా చేసిన చర్యగా అధికారులు పరిశీలిస్తున్నారు. కేరళ నుంచి మధ్యప్రదేశ్ వరకు విస్తరించిన ఈ కేసును విచారణ బృందం కేవలం 72 గంటల్లోనే కీలకంగా ఛేదించింది. మహేశ్వర్ మున్సిపల్ అధికారులు ఇచ్చిన పాత జనన ధృవీకరణ పత్రాన్ని రద్దు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మోనాలిసా తల్లిదండ్రులు సమర్పించిన కుల ధృవీకరణ పత్రాల ద్వారా ఆమె షెడ్యూల్డ్ తెగకు చెందిన మైనర్ బాలిక అని కూడా నిర్ధారితమైంది. మైనర్ బాలికని వివాహం చేసుకున్నందుకు ఫర్మన్ ఖాన్ ప్రస్తుతం తీవ్రమైన చట్టపరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. పోక్సో చట్టం కింద కేసు నమోదు కావడంతో అతనిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# కాళేశ్వరాన్ని రెండేళ్లుగా ఎందుకు నానబెట్టారు

మొదటి తరువాయి

కాళేశ్వరానికి మరమ్మతులు అంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్, అర్బన్ ఫారెస్ట్రీలో తీవ్రమైన అవినీతి జరుగుతోందన్నారు. రియల్ ఎస్టేట్ కోసం ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్‌కు నష్టం చేయవద్దని కోరారు. అలాగే జీహెచ్‌ఎంసీలో తీవ్ర అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. అనేక గ్రామాలు జీహెచ్‌ఎంసీ పరిధిలో కలిసినా సరైన అభివృద్ధి జరగడం లేదని విమర్శించారు. హెచ్‌ఎండీఏ పరిధిలో 35 వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అమ్మకానికి పెట్టారని తెలిపారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ అభివృద్ధికి ఉపయోగించలేదని కవిత ఆరోపించారు. హెచ్‌ఎండీఏకు చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. 2017 నుంచి 2021 వరకు 480 కోట్ల రూపాయల పనులను నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని కవిత తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత మరో 1,140 కోట్ల రూపాయలను అదే పద్ధతిలో కాంట్రాక్టులు ఇచ్చారని వెల్లడించారు. ఇది ఆర్థిక శాఖ నిబంధనలకు వ్యతిరేకమని చెప్పుకొచ్చారు. రూ.50 కోట్ల టెండర్ వేస్తే దాదాపు 50 శాతం తిరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంటుందని.. కానీ నామినేషన్ పద్ధతిలో ఇలాంటి లాభం లేకపోవడం అవినీతికి దారితీస్తోందని ఆరోపించారు. నర్సరీ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్న 6 వేల మంది స్కిల్డ్ లేబర్‌కు 23,800 రూపాయలు ఇవ్వాల్సి ఉందని కవిత తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారంలో ఒక కంపెనీపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ వేయించారని.. తర్వాత ఏమైందో తెలియాలని ప్రశ్నించారు. ఔటర్ రింగ్ రోడ్డులో గత ప్రభుత్వం ఇచ్చిన కాంట్రాక్టును రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కూడా కొనసాగిస్తున్నారని విమర్శించారు. దీనిపై ఆరోపణలు చేసిన రేవంత్ దీనిని ఎలా కొనసాగిస్తారని అన్నారు. ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌పై ముఖ్యమంత్రి దృష్టి పెడుతున్నారని.. సీఎం దగ్గర బ్యాగులు మోసే వ్యక్తి చెప్పినట్టు మాత్రమే పనులు జరుగుతున్నాయని కవిత ఆరోపించారు. జీహెచ్‌ఎంసీ అంటే గుంపు మేస్త్రి పాలనలో జరుగుతున్న మహా అవినీతి అని వ్యాఖ్యానించారు. అవినీతి కోసమే సీఎం 'ఫ్యూచర్ సిటీ' అంటున్నారని కవిత అన్నారు. నెల 25వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 21 కమిటీలు వేశామని కవిత చెప్పారు. 500 మంది వలంటీర్లు సేవలు అందిస్తారని తెలిపారు. మహిళా బిల్లు అమలు కాకపోవడంతో 12 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు నష్టపోయారని చెప్పారు. 2027 జనగణన తర్వాత మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. ధర్మపురి అరవింద్‌లో పురుష అహంకారం కనిపిస్తోందని.. ప్రజలు ఆయన్ను ఎప్పుడో మర్చిపోయారని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నాను... ఎవరో చెప్తే పార్టీ పెట్టే స్థాయిలో లేను' అని కవిత స్పష్టం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను కేరళం ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని తాము వీడియో రిలీజ్ చేశామని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు.

# 20న బీఆర్‌ఎస్‌లోకి జీవన్‌రెడ్డి

మొదటి తరువాయి

వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్న జీవన్‌రెడ్డిని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. కేసీఆర్‌ను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈనెల 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు ముఖ్య అతిథిగా రావాల్సిందిగా కేసీఆర్‌ను జీవన్ రెడ్డి ఆహ్వానించారు. 'మీతో కలిసి పనిచేయాలని ఆ దేవుడే తనను పంపాడు.. తిరోగమనంలో ఉన్న కాంగ్రెస్‌పై యుద్ధం చేయాలి' అంటూ ఎమోషన్ అయినట్టు సమాచారం. కాగా కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న పరిణామాలపై అసంతృప్తితో ఉన్న ఆయన ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. కేటీఆర్ ఆయనతో చర్చలు జరిపారు. గురువారం స్వయంగా జగిత్యాలకు వెళ్లి భేటీ అయ్యారు. ఈ క్రమంలో జీవన్‌రెడ్డి కేసీఆర్‌ను కలిశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమాలకర్, కొప్పుల ఈశ్వర్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్.రమణ, బీఆర్‌ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు కె.విద్యాసాగర్‌రావు, మాజీ కార్పొరేషన్ చైర్మెన్ గ్యాదరి బాలమల్లు, మాజీ జిల్లా చైర్మెన్ వసంత తదితరులున్నారు.

## టోల్ ప్లాజాల వద్ద ఇక నో క్యాష్ పేమెంట్స్

**అమల్లోకి కొత్త నిబంధనలు**




**న్యూఢిల్లీ**

జాతీయ రహదారులపై ఉన్న టోల్ ప్లాజాల వద్ద టోల్ రుసుమును శుక్రవారం నుంచి నగదు రూపంలో చెల్లించే అవకాశం లేదని కేంద్ర రోడ్డు రవాణా శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాలని స్పష్టం చేసింది.డిజిటల్ చెల్లింపులు చేసే అవకాశం లేని వాహనదారులకు ఇది ఇబ్బందికరమైనా.. టోల్ గేట్ల వద్ద భారీ వరుసలను తగ్గించి ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు ఈ కొత్త నిబంధనను అమలు చేస్తున్నట్టు ఓ సీనియర్ అధికారి తెలిపారు. మరోవైపు ఫాస్టాగ్‌తో కాకుండా యూపీఐతో చెల్లింపులు జరిపితే 1.25 రెట్లు ఎక్కువగా టోల్ చెల్లించాల్సి ఉంటుందని నోటిఫికేషన్ తెలిపింది. ఈ నెల 1న ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరను ఎన్‌హెచ్‌ఏఐ 2.5 శాతం పెంచడంతో దాని ధర రూ.3,075కు చేరుకొన్నది.

# మంత్రి వాకిటి శ్రీహరికి ఎంపీ డీకే అరుణ సవాల్

- ఆత్మకూరు చౌరస్తాలో చర్చకు రండి
- ఆత్మకూరు - కొత్తపల్లి బ్రిడ్జి అరుణమ్మ అడ్డుకుంటుందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు..
- బరాబర్ జూరాల సేఫ్టీ బ్రిడ్జి, ఆత్మకూరు ట్రాన్స్పోర్ట్ బ్రిడ్జి కట్టండి. ఎంపీ డీకే అరుణ





**మిడ్జిల్, ఏప్రిల్ 10, (ఉమ్మడినేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
ఆత్మకూరు, అమరచింత, మక్తల్ మున్సిపాలిటీలకు అమృత్ పథకం కింద నిధులు మంజూరు అయ్యాయి. అమృత్ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం.. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, మున్సిపాలిటీలు ఈ పథకంలో భాగస్వామ్యులు. చెరువుల సుందరీకరణ,పార్కు, మురుగునీరు కలవకుండా అభివృద్ధి చేపట్టడం జరిగింది.ఆత్మకూరు,అమరచింత మున్సిపాలిటీలకు ఒక్కో మున్సిపాలిటీకి 3కోట్ల14లక్షల 60వేల రూపాయలు నిధులు వచ్చాయి. ప్రోటోకాల్ కి విరుద్ధంగా మాకు సమాచారం ఇవ్వకుండా మంత్రి వాకిటి శ్రీహరి శంకుస్థాపన చేసి వెళ్ళారు. ప్రతి అధికారిక కార్యక్రమంలో ప్రజాప్రతినిధులుగా మాకు ఆహ్వానం అందించాలి. అడ్డుకుంటామని ఎవరిని బెదిరిస్తున్నారు..

**కేంద్ర ప్రభుత్వ నిధులు అడ్డుకుంటారా..?**

మీ తాటి ఆకు చప్పుళ్లకు చింతకాయలు రాలవు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం ప్రజలకు చేరవేయడం మా బాధ్యత. గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్వాడీ,మహిళా సంఘాల భవనాలు లేవు. జీ రామ్ జీ పథకం ద్వారా మౌలిక వసతుల కల్పనలు రాష్ట్ర ప్రభుత్వం వాటా ఇవ్వమంటే.. ఇవ్వం అంటారు. ప్రోటోకాల్ పాటించకుండా.. మహిళా ఎంపీని ఆయన నన్ను మీరు అవమానిస్తున్నారు. భూమి పూజ చేస్తే.. మీకు కడుపు మంట ఎందుకు.?

**కుసుమ్ పథకం కేంద్ర ప్రభుత్వ పథకం కాదా..? మంత్రి వాకిటి శ్రీహరికి ఎంపీ అరుణ సవాల్**

ఆత్మకూరు - కొత్తపల్లి బ్రిడ్జి అరుణమ్మ అడ్డుకుంటుందని అబద్ధపు ప్రచారం చేస్తున్నారు.. బరాబర్ జూరాల సేఫ్టీ బ్రిడ్జి, ఆత్మకూరు ట్రాన్స్పోర్ట్ బ్రిడ్జి కట్టండి. సీఎంను స్థానిక మంత్రి ఒప్పించలేక.. ఇరిగేషన్ బ్రిడ్జిను.. ట్రాన్స్పోర్ట్ బ్రిడ్జి గా మారుతున్నారు. జూరాల భద్రతకు ముప్పు ఉంది.. సేఫ్టీ బ్రిడ్జి కట్టాలని కోరడం జరిగింది. జూరాల ప్రాజెక్ట్ పాలమూరు జిల్లాకు గుండె. మంత్రిగా ఉండి.. శ్రీహరి ట్రాన్స్పోర్ట్ బ్రిడ్జి తేలేరా..? మీతో పాటు బ్రిడ్జి కోసం సీఎం వద్దకు నేను వస్తా పదండి. ఆత్మకూరు బ్రిడ్జి వస్తె నాకే మంచిది.. గద్వాల కు వెళ్లేందుకు సమయం తగ్గుతుంది. అరుణమ్మ అభివృద్ధి చేస్తుంది తప్ప.. అభివృద్ధి ఎప్పుడూ అడ్డుకోదు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక రాష్ట్రం దివాళా తీసిందని చెబుతున్నారు. ప్రతి ఒక్క పేదవాడు ఆర్థికంగా ఎదగాలని ప్రధాని మోదీ పని చేస్తున్నారు.

# క్రికెట్,వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం

- చేసిన సంసద్ ఖేల్ పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి





**మిడ్జిల్, ఏప్రిల్ 10, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
జడ్చర్ల పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్ క్రీడ పోటీలలో భాగంగా రెండవ రోజు క్రికెట్ వాలీబాల్ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంసద్ ఖేల్ పార్లమెంట్ ఇంచార్జ్ ముచర్ల జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. యువకులు క్రీడల్లో పాల్గొని మన జిల్లాకి గుర్తింపు తేవాలని వారికి వివరించారు. రెండవ రోజు అనేకమంది యువకులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అమర్నాథ్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, బుక్క నవీన్, శేఖర్, వ్యాయామ ఉపాధ్యాయులు రామ్ కళ్యాణ్, శ్రీదేవి, విజయ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేయాలి...

- జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్మోహన్ రెడ్డి....



**ఆమనగల్లు,ఏప్రిల్10(నేటి దర్శిని ప్రతినిధి):**
నూతనంగా నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా కాంట్రాక్టర్లు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామ్మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను డిఈ కోటయ్య తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఈ ఈ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం కోట్ల రూపాయల వ్యయంతో 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రూపాయలు 17.50 కోట్లు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు మరింత చేరువలో వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.పనుల్లో నాణ్యతాలోపం ఉండవద్దని, వేగవంతంగా పనులు చేయాలని,జూన్ రెండవ తారీకున ఆసుపత్రి భవనం పూర్తిచేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆయన కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షుడు మెకానిక్ బాబా,సైట్ ఇన్చార్జ్ శంకర్,బాలకృష్ణ, గడిగే శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

# పుట్టినరోజు వేడుక ఖర్చులు మాని సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలి


- బిజెపి జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్
- పుట్టినరోజు పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలో టాయిలెట్స్ ఫ్లోరింగ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రవికుమార్
- గంట రవికుమార్ వినూత్న సేవా కార్యక్రమం




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 10 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షుడు, సత్యం గ్రూప్ సత్యం గ్రూప్స్ ఫౌండర్ గంట రవికుమార్ తన 45వ పుట్టినరోజును వినూత్నంగా నిర్వహించి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. పాఠశాలలో విద్యార్థులకు సరైన మూత్రశాలల సౌకర్యం లేకపోవడాన్ని గుర్తించిన ఆయన, కొత్తగా మూత్రశాలల నిర్మాణాన్ని ప్రారంభించారు. అదేవిధంగా పాఠశాల భవనంలో ఫ్లోరింగ్ పనులను కూడా చేపట్టి, విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ "పుట్టినరోజులు, పెళ్లి వార్షికోత్సవాల పేరుతో లక్షల రూపాయలు ఖర్చు చేయడం వల్ల సమాజానికి ఉపయోగము ఉండదని, అదే డబ్బుతో చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తే సమాజానికి మేలు జరుగుతుందని అన్నారు.ఆయన చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత మంది ప్రజాప్రతినిధులకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు నరేందర్ స్వామి గంట రవికుమార్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన....

- కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి...



**ఆమనగల్లు,ఏప్రిల్ 10(నేటి దర్శిని ప్రతినిధి):**
ఆమనగల్ పట్టణ మునిసిపాలిటీలోని రైతు వేదిక లో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, చెక్కులను పంపిణీ చేశారు. కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రతి పథకాన్ని అర్హులకు అందిస్తామని అన్నారు.ఇది ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజా ప్రభుత్వమని, ఎన్నికలలో మా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటిని ప్రభుత్వపరంగా నెరవేరుస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పత్యానాయక్,వైస్ చైర్మన్ గీత చారి, ఏఎంసీ చైర్మన్ యాట గీత,ఆమనగల్ మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు,10వ వార్డ్ కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెలుగమల్ల జగన్, మానయ్య,ఆవ్వారి శివలింగం,గుద్దేటి శివ, మహేష్,ఐఎన్ టియుసి జిల్లా అధ్యక్షులు ఎంగలి ప్రసాద్,కేఎన్ఆర్ సేవాదళం అధ్యక్షులు మెకానిక్ బాబా, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్సీ



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 10 (నేటి దర్శిని బ్యూరో):**
హాస్పిటల్ లో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేదలకు సీఎం సహాయనిది ఒక వరంలా మారిందని ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య అన్నారు. వరంగల్ నగరంలోని పలువురు లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, డిసిసి అధ్యక్షుడు ఆయుబ్ తో కలిసి సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్రీమాన్, గుండేటి నరేంద్ర కుమార్, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# భద్రకాళి చెరువు కూడికతీత పనులను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 10 (నేటి దర్శిని బ్యూరో):**
శ్రీ భద్రకాళి చెరువుపూడిక తీత పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. భద్రకాళి చెరువులో కూడిక తీత పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం 2 క్యూబిక్ మీటర్ల పూడికతీత పూర్తయిందని, మిగిలిన పూడికతీతను మే 15లోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# సంపాదకీయం

## ఫూలే ఎజెండా నేటి దేశానికి అవసరం!



నేడు ఏప్రిల్ 11, మహాత్మా జ్యోతిరావు ఫూలే 199వ జయంతి. ఈ యేడాది పొడుగునా ఆ మహాత్ముడి ద్విశత జయంతి సంబరాలు దేశవ్యాప్తంగా జరగనున్నాయి. భారతదేశపు సాంస్కృతిక పునరుజ్జీవన పతాకగా పేరుగాంచిన ఆ మహనీయుడు జన్మించి రెండు వందల యేళ్లు కావస్తున్నా.. నేటికీ ఆయన జీవితం గురించి, ఆయన చేపట్టిన ఉద్యమాల గురించీ దేశ ప్రజలలో ప్రచారం తక్కువగానే ఉన్నది. వాస్తవానికి గత నలభై, యాభై యేళ్ల నుంచే ఫూలే గురించి దేశవ్యాప్తంగా చెప్పుకోదగ్గ ప్రచారం మొదలైందని చెప్పాలి. అంతకు మునుపు ఆయన ఉనికిని కాలరాసే ప్రయత్నాలు సాగినవి. మూఢాచారాలనీ, మనువాద భావజాలాన్నీ తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వాడుకున్న ఆధిపత్య శక్తులు.. తమకు వ్యతిరేకంగా ప్రజల్లో ప్రచారం చేసిన వారి నోరునొక్కడమో.. వారి చరిత్రను కనుమరుగు చేసే కుట్రలు పన్నడమో చేశాయి. తెలుగునాట.. మూఢాచారాలను, బ్రాహ్మణ భావ జాలాన్నీ తన కవితలతో ప్రశ్నించిన వేమన చరిత్రను.. రెండువందల యేళ్ల పాటు మట్టిలో కప్పివేస్తే.. చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అనే విదేశీ దొర పుణ్యాన.. ఆ సామాజిక విప్లవమూర్తి చరిత్ర, ఆయన కవితా సంపద మళ్లీ మనకు దక్కింది. ఫూలే విషయంలోనూ అదే తరహా అన్యాయం జరిగింది. మహాత్మా ఫూలే లోకమాన్య బాల గంగాధర తిలకులిద్దరూ సమకాలీకులే. ఇద్దరూ మహారాష్ట్రలోని పూణే నగరవాసులే. ఫూలేనేమో.. మనుషులం దరూ సమానులేనని వాదించిన ప్రగతిశీల వాది కాగా.. 'లోకమాన్యుడు' మాత్రం అసమానతల చాతుర్వర్ణ వ్యవస్థ బరాబర్ కొనసాగాల్సిందేనని పట్టుబట్టిన నికార్సైన ఛాందసవాది. "స్వరాజ్యం నా జన్మహక్కు" అని గొప్పగా నినదించిన ఆ పెద్దమనిషి.. ఆ స్వరాజ్యంపై హక్కు, సమాజంలోని కొన్ని వర్గాల వారిదేనని సైతం వాదించడం చారిత్రక విషాదం. అలాంటి బాలగంగాధర్ తిలక్.. మనందరి హైస్కూల్ పాఠ్యపుస్తకాలలో కొలువుదీరాడు. సమసమాజం కోసం ఉద్యమించిన ఫూలే ప్రస్తావన.. నేటికీ పాఠ్యాంశాలలో చోటు దక్కించుకోలేదు! భారతీయ సమాజాన్ని మానవతా విలువల పునాదులపై నిర్మించడానికి గతంలో ఎందరో మహనీయులు కృషి చేశారు. నేడు కొందరు అమాయకంగా భారతదేశంలో సనాతన ధర్మమంటే బ్రాహ్మణ ధర్మమే అని అనుకుంటారు. నిజానికి.. కణాదుడు, అజితకేశ కంబళుడు, చార్వాకులు, లోకాయతులు, జైనులు, బుద్ధుడూ.. ప్రవచించిన సమతాధర్మమే ఈ దేశపు గడ్డపై సనాతన ధర్మం! పాశ్చాత్య నాగరికతలో గ్రీకు దేశానికి చెందిన ప్లేటోని హేతువాద పితామహుడిగా పేర్కొంటారు. ఆ ప్లేటో బతికిన కాలానికి 200 సంవత్సరాలకు ముందే.. క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దిలో.. మనగడ్డపై అజిత కేశ కంబళుడు హేతువాదాన్ని, సమతావాదాన్ని ప్రచారం చేసి.. పురోహిత వర్గం ప్రచారం చేస్తున్న మూఢా చారాలను బహిరంగంగా సవాల్ చేశాడు. ఆధునిక యుగంలో ఆ సమతావాద సంస్కృతికి మళ్లీ జీవం పోసి.. ఇంగ్లీషు విద్య వెలుగులో కుల విషవృక్షాన్ని సమూలచ్ఛేదం చేయడానికి మహోన్నత ఉద్యమం నడిపి మహాత్ముడై నిలిచినవాడు జ్యోతిబా ఫూలే. ఆధిపత్యవర్గాలు తమ దోపిడీ విధానాలకు సామాన్య ప్రజల సమ్మతిని రాబట్టడం కోసమే కృత్రిమంగా చాతుర్వర్ణ వ్యవస్థను సృష్టించారు. అందులో.. దోపిడీ చేసేవారికి పై స్థానాలను అంటగట్టి, సంపద సృష్టికర్తలైన శ్రామిక వర్గాలకు శూద్రులు, అతిశూద్రులు అనే పేర్లను తగిలించారు. ఆధిపత్య వర్గాల దురాగతాలను నిరోధించడానికి, శ్రామికవర్గ ప్రజలలో చైతన్యం తీసుకురా వడానికి.. ఫూలే 1873 సెప్టెంబరు 24న 'సత్య శోధక్ సమాజ్' సంస్థను స్థాపించాడు. నిమ్నవర్గాల ప్రజలను కులదోపిడీ నుంచి విముక్తి చేయడంతోపాటు రైతులు, కూలీలను హక్కులకోసం సంఘటితపరిచేందుకు ఈ సంస్థ ద్వారా ఫూలే విశేషంగా కృషి చేశాడు. విద్యాజ్ఞానాలను అందుకోవడం ద్వారానే శూద్ర, అతిశూద్రులు తమ హక్కులను నిలబెట్టుకోగలరని గుర్తించి వారిలో విద్యావ్యాప్తి కోసం ప్రత్యేక పాఠశాలలను ఏర్పరచాడు. దళిత వర్గాల స్త్రీలకు సైతం విద్య అందాలనే ఉద్దేశంతో వారి కోసం ప్రత్యేక పాఠశాలల నెలకొల్పాడు. దళిత స్త్రీలకు చదువు చెప్పడానికి అగ్రవర్ణాల స్త్రీలు ముందుకురాని పరిస్థితుల్లో తన భార్య సావిత్రీబాయికి తాను చదువు నేర్పి, ఉపాధ్యాయినిగా తీర్చిదిద్ది ఆమెచేత దళిత స్త్రీలకు చదువు చెప్పించాడు. సత్యశోధక సమాజ్ సభ్యుడైన నారాయణ మేఘాజీ లొఖాండే బంబాయిలోని మిల్లు కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించారు. భారత కార్మికులకు ఆదివారం సెలవు దినం, మధ్యాహ్న భోజన విరామం రావడం గనక లొఖాండే కృషి ఎంతో ఉన్నది. విగ్రహారాధనను, కుల వ్యవస్థను, వేదాల పవిత్రతను ప్రశ్నించాలని ఫూలే ప్రజలకు ఉద్బోధించేవాడు. మూఢా చారాలను ఖండిస్తూ ప్రజల్లో హేతువాద ధోరణులను పెంపొందింపజేయడానికి సత్య శోధక్ సమాజ్ సభ్యులు పాటుపడ్డారు. భగవంతునికి, భక్తునికి మధ్య అనుసంధాన కర్తగా పురోహితవర్గం ఉండాల్సిన అవసరమే లేదని ఫూలే వాదించేవాడు. పురాణాలు, వేదాలు దైవదత్తమైనవి కావని, మనుషులు రాసినవేనని, నేటికాలానికి అనుగుణంగా వాటిల్లో మార్పులు కూడా చేసుకోవచ్చని వాదించేవాడు. కొందరు స్వార్థపరుల వికృత ఆలోచనల్లోంచే కులవ్యవస్థ ఆవిర్భవించింది తప్ప భగవంతుడు సృష్టించింది కానేకాదని ఆయన తన సభల్లో వివరించేవాడు. పక్షుల్లో, జంతువుల్లో లేని కుల భేదాలు మానవుల్లో ఎందుకున్నాయని అగ్రవర్ణాల పండితులను ఆయన నిలదీసేవాడు.

## ఆ ఊళ్లో బూతులు మాట్లాడితే

# జేబుకు చిల్లు పడినట్లే

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 10 నేటి దర్శిని)** అది పూర్తిగా బూతుల రహిత గ్రామం..! ఆ గ్రామంలో బూతులు మాట్లాడటంపై నిషేధం ఉంది..! నిషేధాన్ని ఉల్లంఘించి ఎవరైనా బూతులు మాట్లాడితే వారి జేబుకు చిల్లుపడినట్లే. ఏకంగా రూ.500 జరిమానా కట్టాల్సిందే. ఈ మేరకు ఆ గ్రామ పంచాయతీ తీర్మానం కూడా ఉంది. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని గ్రామ పెద్దలు చెప్పారు. సాధారణంగా గ్రామాల్లో అయినా, పట్టణాల్లో అయినా గొడవలు జరుగుతుంటాయి. ఈ గొడవల సందర్భంగా బూతులు కూడా దొర్లుతాయి. ఇలా బూతులు జారడంవల్ల చిన్న గొడవలు కూడా పెద్దవిగా మారుతాయి. అందుకే మధ్యప్రదేశ్ రాష్ట్రం




బుర్హాన్‌పూర్ జిల్లాలోని బోరిసర్ గ్రామంలో బూతులపై పూర్తిగా నిషేధం విధించారు. నిషేధాన్ని ఎవరైనా ఉల్లంఘిస్తే రూ.500 జరిమానా విధించనున్నట్లు ప్రకటించారు. బుర్హాన్‌పూర్ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ గ్రామంలో 6 వేల మంది జనాభా ఉంటారు. గ్రామంలో ధనిక, పేద తేడా లేకుండా ఎవరు బూతులు మాట్లాడినా రూ.500 జరిమానా విధిస్తారు. ఒకవేళ జరిమానా కట్టకపోతే గంటసేపు గ్రామంలో పారిశుధ్య పనులు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు గ్రామమంతా పోస్టర్లు వేయించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కాగా, బూతులతో గొడవలు పెద్దవి చేసుకోకుండా ప్రజలందరికీ అవగాహన కల్పిస్తున్నామని, ప్రత్యేక బృందాలతో పర్యవేక్షణ చేయిస్తున్నామని సర్పంచి అంతర్‌సింగ్ తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం కూడా ఏర్పాటు చేశామని, అదేవిధంగా నాలుగుచోట్ల ఉచిత వైఫై సదుపాయం, గ్రామం అంతటా ఇంటర్నెట్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు.

## హెర్ముజ్‌లో అమెరికా

# డ్రోన్ మిస్సింగ్!

- ధర రూ.1,800 కోట్లు



**వాషింగ్టన్ ఏప్రిల్ 10 నేటి దర్శిని)** అగ్రరాజ్యం అమెరికాకు మరో భారీ షాక్. హెర్ముజ్‌లో సీక్రెట్ ఆపరేషన్ సందర్భంగా ఆ దేశానికి చెందిన నిఘా డ్రోన్ ఎంక్యూ-4సీ ట్రైటన్ గల్లంతైంది. ఈ డ్రోన్ ధర రూ.1800 కోట్లకు పైమాటే. ఇరాన్‌తో యుద్ధంలో అమెరికా పెద్ద ఎత్తున యుద్ధ విమానాలను కోల్పోయిన సంగతి తెలిసిందే.తాజాగా అత్యంత ఖరీదైన డ్రోన్ కనిపించకుండా పోవడం ఆ దేశానికి గట్టి ఎదురుదెబ్బే అని భావిస్తున్నారు. ఈ డ్రోన్ కూలిపోయిందా లేక ఇరాన్ కూల్చిందా అన్న విషయం తెలియరాలేదు. 2018లో ఈ డ్రోన్ అమెరికా అమ్ములపొదిలో చేరింది. ఇరాన్ యుద్ధంలో ఎఫ్-35, ఎఫ్-15ఈ, ఏ-10 యుద్ధ విమానాలను అమెరికా కోల్పోయింది. అలాగే 17 ఎంక్యూ-9 రీపర్ డ్రోన్లను కూడా నష్టపోయింది.

## ఆయుధాలతో యుద్ధ నౌకలు సిద్ధం..


- ఇరాన్‌కు ట్రంప్ తాజా హెచ్చరిక



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10 నేటి దర్శిని)** ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలకు సమయం ముంచుకొస్తున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఇరాన్‌కు తీవ్ర హెచ్చరికలు జారీచేశారు. ఇరాన్ వద్ద ఇక ఏ మార్గమూ మిగల్లేదని, కీలక అంతర్జాతీయ జలమార్గాలపై నియంత్రణ ద్వారా ప్రపంచాన్ని స్వల్పకాలికంగా దోచుకోవడంపై మాత్రమే ఇరాన్ ఆధారపడుతున్నదని ట్రంప్ విమర్శించారు.తమ వద్ద వేరే మార్గాలు లేవని ఇరానీయులు ఇంకా గ్రహించినట్లు లేరని ఆయన వ్యాఖ్యానించారు. వారు ఈ రోజు సజీవంగా ఉండడానికి ఏకైక కారణం చర్చలు జరపడమే అని ఆయన పేర్కొన్నారు. పాకిస్థాన్‌లో శాంతి చర్చలు విఫలమైతే దాడులను పునరుద్ధరించడానికి శక్తివంతమైన ఆయుధాలతో అమెరికా యుద్ధ నౌకలను సిద్ధం చేస్తున్నట్లు న్యూయార్క్ పోస్టుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హెచ్చరికలు జారీచేసిన కొన్ని గంటల్లోనే ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి.

## 40 రోజుల్లో 5000 మంది ఇరానీ సైనికులు మృతి: ఐడీఎఫ్

**జెరుసలాం ఏప్రిల్ 10 నేటి దర్శిని)** ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా-ఇజ్రాయెల్ దళాలు సంయుక్తంగా ఇరాన్‌పై ఆకస్మిక దాడి చేసిన విషయం తెలిసిందే. ఇరాన్‌పై జరిగిన దాడిలో మొదటి రోజే ఆ దేశ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీతో పాటు సుమారు 40 మంది మిలిటరీ కమాండర్లు చనిపోయారు. అయితే కేవలం 40 సెకన్లలోనే 40 మంది టాప్ ఇరానీ మిలిటరీ కమాండర్లను హతమార్చినట్లు ఇజ్రాయెల్ రక్షణ దళం(×ఐఖీ) పేర్కొన్నది. ఇరాన్‌తో సీజ్‌ఫైర్ కుదిరిన నేపథ్యంలో ఐడీఎఫ్ ఓ రిపోర్టును రిలీజ్ చేసింది. 40 రోజుల వార్‌లో అనేక మంది ఇరానీ కమాండర్లను చంపినట్లు ఐడీఎఫ్ చెప్పింది. డజన్ల సంఖ్యలో సీనియర్, మీడియా రేంజ్ ఇరానీ ఆఫీసర్లను కూడా ఏరివేసినట్లు ఇజ్రాయెల్ పేర్కొన్నది. ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో సుమారు 5 వేల మంది ఇరానీ సైనికులు మృతిచెందినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. వేల సంఖ్యలో ఇరానీ సైనికులు గాయపడినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. మృతుల్లో అంతర్గత భద్రతా బలగాలు, బసిజి పారామిలిటరీ దళాలు ఉన్నట్లు తెలిసింది.ఇజ్రాయిలీ అటాక్‌లో మృతిచెందిన వారిలో ఖమేనీతో పాటు మిలిటరీ అడ్వైజర్ అలీ శామ్‌ఖానీ, ఐఆర్జీసీ కమాండ్ మొహమ్మద్ పాక్‌పౌర్, ఐఆర్జీసీ నేవీ చీఫ్ అలీరెజా తంగసిరి, ఐఆర్జీసీ ఇంటెలిజెన్స్ చీఫ్ మసీద్ ఖాదేమి,



బసిజి పారామిలిటరీ దళ కమాండర్ గోలంరెజా సోలేమానీ, ఐఆర్జీసీ ప్రతినిధి అలీ మొహమ్మద్ నైని, నేషనల్ సెక్యూర్టీ కౌన్సిల్ హెడ్ అలీ లారిజారి, డిఫెన్స్ మినిస్టర్ అజిన్ నాసిర్‌జాద్‌ఏ, ఎస్‌ఎపీఎన్డీ చైర్మెన్ హుసేన్ జాబల్ అమేలియన్, ఖమేనీ మిలిటరీ సెక్రటరీ మొహమ్మద్ షిరాజి ఉన్నారు. ఇరాన్ న్యూక్లియర్ ప్రోగ్రామ్‌ను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ చెప్పింది. అనేక ఇరానీ అణు కేంద్రాలపై దాడులు చేసినట్లు చెప్పింది. ఇరాన్ వద్ద సుమారు 60 శాతం శుద్ధీకరించిన 400 కేజీల యురేనియం ఉన్నట్లు ఇజ్రాయెల్ అనుమానం వ్యక్తం చేసింది. ఆ యురేనియంతో దాదాపు 11 అణు బాంబులను తయారు చేయవద్దు అని ఇజ్రాయిల్ అధికారులు అంచనా వేశారు. యాజ్ద్ పట్టణం వద్ద ఉన్న న్యూక్లియర్ ప్లాంట్‌పై దాడి చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది. అరాక్‌లో ఉన్న హెవీ వాటర్ రియాక్టర్‌పై కూడా దాడి జరిగింది. టెహ్రాన్‌లోని మలేక్ అస్తార్ యూనివర్సిటీలో ఉన్న న్యూక్లియర్ రీసర్చ్ డెవలప్మెంట్ సైట్, పార్చిన్ మిలిటరీ కాంప్లెక్స్‌లోని తలేగాన్ 2 కేంద్రం, మిన్‌జాదేహి సీక్రెట్ అండర్‌గ్రౌండ్ కేంద్రంతో పాటు ఇతర అణు కేంద్రాలను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఇరాన్‌కు ఆర్థిక నష్టం కలిగించే గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై అటాక్ చేసినట్లు ఐడీఎఫ్ చెప్పింది. రెండు భారీ స్టీల్ ఫ్యాక్టరీలు, అనేక పెట్రోకెమికల్ కేంద్రాలు, 10 కీలకమైన రైలు మార్గాలు, బ్రిడ్జిలను పేల్చినట్లు ఐడీఎఫ్ తెలిపింది. పెట్రోకెమికల్ కేంద్రాల్లో ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులను తయారు చేసినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. రైలు మార్గాలు, బ్రిడ్జిల ద్వారా ఆయుధాలను ఇరాన్ సరఫరా చేసినట్లు ఐడీఎఫ్ తెలిపింది.

## ఎలక్ట్రోమ్యాగ్నటిక్, బ్లాకౌట్ బాంబులను

# పరీక్షించిన ఉత్తర కొరియా

**న్యూఢిల్లీ: ఏప్రిల్ 10 నేటి దర్శిని)** కొత్త తరహా హైటెక్ ఆయుధాలను ఉత్తర కొరియా పరీక్షించింది. ఎప్పుడూ బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాలతో హోరెత్తించే ఆ దేశం ఇప్పుడు తాజాగా ఎలక్ట్రోమ్యాగ్నటిక్ వెపన్స్, కార్బన్ ఫైబర్ బాంబులను పరీక్షించింది. వీటితో పాటు న్యూ మొబైల్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను కూడా పరీక్షించినట్లు ఆ దేశ మీడియా పేర్కొన్నది. మూడు రోజుల పాటు ఆ పరీక్షలు జరిగినట్లు ఉత్తర కొరియా జనరల్ కిమ్ జాంగ్ సిక్ తెలిపారు. దేశ ఆయుధ బాండాగారంలో కొత్త తరహా ఆయుధాలు చేరాయని, ఎలక్ట్రోమ్యాగ్నటిక్ సిస్టమ్‌తో పాటు కార్బన్ ఫైబర్ బాంబులు ప్రత్యేక అసెట్స్ కానున్నట్లు చెప్పారు. అయితే ఈ కొత్త తరహా ఆయుధాల గురించి ఆయన ఎక్కువ సమాచారం ఇవ్వలేదు.నార్త్ కొరియా భూభాగం నుంచి అనేక



మిస్సైళ్లను లాంచ్ చేసినట్లు గుర్తించామని దక్షిణ కొరియా మిలిటరీ పేర్కొన్నది. ఆ ప్రొజెక్టైల్స్ సుమారు 240 నుంచి 700 కిలోమీటర్ల దూరం ప్రయాణించి ఉంటాయని పేర్కొన్నారు. బ్లాకౌట్ కార్బన్ ఫైబర్ బాంబ్లతో.. ఎలక్ట్రిక్ గ్రిడ్‌లు, పవర్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేయవచ్చు. ఆ బాంబుల నుంచి విడుదలయ్యే గ్రాఫైట్ ఫిలమెంట్లు ఎలక్ట్రిక్ గ్రిడ్లలో షార్ సర్క్యూట్ అయ్యేలా చేస్తాయి. నాన్ న్యూక్లియర్ ఎలక్ట్రోమ్యాగ్నటిక్ పల్స్ వెపన్ ఓ ప్రత్యేకమైన డివైస్. దీనితో మిలిటరీ అసెట్స్‌లో ఉన్న ఎలక్ట్రానిక్ సర్క్యూట్లను న్యూట్రలైజ్ చేయవచ్చు. రేడార్ వ్యవస్థలను, విమానాలను ఈఎంపీ వెపన్‌తో నిర్వీర్యం చేయవచ్చు. హాసాంగ్-11 అణు సామర్థ్యం కలిగిన బాలిస్టిక్ క్షిపణికి కొత్త తరహా క్లస్టర్ వార్‌హెడ్‌ను అమర్చి పరీక్ష చేసినట్లు ఉత్తరకొరియా మీడియా పేర్కొన్నది.

# తోటి పద్మశాలి కుటుంబానికి ఆర్థిక సాయం

● చేసిన పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్ బావశీర్ల మధు



**మిడ్జిల్, ఏప్రిల్ 10, (నేటి దర్శిని ప్రతినిధి):** కల్వకుర్తి పట్టణంలోగచ్చుబావి ప్రాంతంలో ఒక పద్మశాలి కుటుంబ సభ్యులకు వ్యాపార అభివృద్ధి కి కొంత ఆర్థిక అవసశీరం ఉందని తెలిసిన వెంబడే పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు కౌన్సిలర్ భావండ్ల మధు, పద్మశాలి వ్యాపార వృద్ధి కోసం పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మ్యాకల రాజేందర్, ప్రధాన కార్యదర్శి మాకం రమేష్, కోశాదికారి గంజి ప్రసాద్, నాయకులు కర్నె జంగయ్య, నాగభూషణం, ఆనంద్, అమరేందర్, హరీష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

# 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

**- వాహనం స్వాధీనం: టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు**



**మిడ్జిల్,ఏప్రిల్ 10, నేటి దర్శిని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో:** నారాయణపేట పట్టణంలోని యాద్గిర్ రోడ్డు, బైరం కొండ గ్రామ సమీపంలో టాస్క్ ఫోర్స్ నారాయణపేట పోలీసులు సంయుక్తంగా శుక్రవారం తెల్లవారు జామున వాహనాల తనిఖీలు నిర్వహించి 25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. ఈ సందర్భంగా పి.డి.ఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని స్ పట్టుబడిన వాహనం టి ఎస్ 06 యు డి 0828 అశోక్ లే లాండ్ వాహనం స్వాదీనం చేసుకుని అందులో నుండి మొత్తం 50 బియ్యం సంచు లు, సుమారు 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం, వాహన యజమాని దామరిగిద్ద మండలం నర్సాపూర్ వెంకటేష్,అని తెలిపారు. డి.టి కాలప్ప పంచనామ అనంతరం వెంక టేష్ పై నారాయణపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

# రోడ్డు భద్రత వీడియో పోటీ

● ఉత్తమ వీడియోకు రూ.5,000 నగదు బహుమతి




**మిడ్జిల్, ఏప్రిల్ 10, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకు జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ తెలియజేయడం ఏమనగా, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం మరియు రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు “అర్రైవ్ అలైవ్ ” అనే నినాదంతో జిల్లా పోలీసు శాఖ తరపున వీడియో పోటీ నిర్వహించబడుతున్నది. ఈ పోటీలో జిల్లాలోని ప్రజలు, విద్యార్థులు, యువత పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించడంతో పాటు రోడ్డు భద్రతపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు సహకరించాలని కోరారు. ఈ పోటీలో పాల్గొనదలచిన వారు రోడ్డు భద్రతకు సంబంధించిన సందేశంతో గరిష్టంగా 3 నిమిషాలు గల వీడియోను రూపొందించి, 14.04.2026 తేదీ సాయంత్రం 5:00 గంటల లోపు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పెన్ డ్రైవ్‌లో గాని లేదా itcellmbnr@gmail.com మెయిల్ కి గానీ సమర్పించవలెను. ఈ పోటీలో ఉత్తమంగా ఎంపికైన వీడియోకు రూ.5,000/- నగదు బహుమతి అందజేయబడును. సందేహాల కోసం సంప్రదించండి: ఐటీ సెల్ ఎస్సై రవి సెల్: 8712659358 ని సంప్రదించగలరు. “రోడ్డు భద్రత -- మనందరి బాధ్యత”

# ప్రధాన మంత్రి సంసద్ ఖేల్ లో పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



ఊర్కొండ మండల కేంద్రంలో పాల్గొన్న పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



రాజాపూర్ మండల కేంద్రంలోరెండవ రోజు ప్రారంభత్సములో పాల్గొన్న ముచ్చర్ల జనార్దన్ రెడ్డి



● రెండవ రోజు వివిధ మండలాల్లో పాల్గొన్నారు



రాజాపూర్ మండల కేంద్రంలో



మిడ్జిల్ మండల కేంద్రంలో

**మిడ్జిల్, ఏప్రిల్ 10, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్ నగర్ జిల్లా పార్లమెంట్ పరిధిలో సంసద్ ఖేల్ మహోత్సవ్ కార్యక్రమం నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమం పాలమూరు పార్లమెంట్ పరిధిలో, మన ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో పార్లమెంట్ పరిధిలో. ఇది క్రీడా ప్రోత్సాహానికి పెద్ద ఉదాహరణ అని పార్లమెంట్ ఇంచార్జ్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి చెప్పారు. ఈ సందర్భంగా, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, “క్రీడా స్ఫూర్తిని యువతలో పెంచాలని సదుద్దేశంతో అరుణ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. యువత చాలా మంది ఈ మధ్యకాలంలో క్రీడలకు దూరంగా ఉన్న సందర్భంలో, ఈ ఆన్‌లైన్ గేమ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్స్కి దూరంగా ఉండి, అదే విధంగా సోషల్ మీడియాలో చెడుకి దూరంగా ఉండి, మంచిని పెంపొందే విధంగా ఉండాలి. అదే విధంగా, గెలుపోటములో సమానంగా కృషి చేసే శక్తి కేవలం క్రీడాకారులకే ఉంటంది, కాబట్టి రెగ్యులర్‌గా క్రీడలు ఆడడం వల్ల మానసికంగా, శారీరకంగా, అన్నివిధాలుగా క్రీడలు మనిషి యొక్క నిత్యజీవితంలో ఎంత దోహదపడతాయో అన్నారు.”యువత మత్తు, మద్యం,గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. క్రమేపీ గ్రామాల్లో కూడా గంజాయి వాడకం యువతలో పెరిగిందని ఈ సందర్భంలో వారు గుర్తుచేశారు. మానసిక ఉల్లాసానికి, అదే విధంగా స్నేహభావాన్ని పెంపొందించడానికి క్రీడలు ఎంతగానో ధోహదపడుతాయని, ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ గొప్ప క్రీడా పోటీలను విజయం సాధించాలని, గెలుపొందినవారికి గవర్నర్ చేతుల మీదుగా బహుమతి ప్రదానం కార్యక్రమం ఉంటుందని అందరూ క్రీడా స్ఫూర్తితో ఈ కార్యక్రమంలో విజయవంతంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు, క్రీడా అభిమానులు తదితరులు పాల్గొన్నారు..

# మున్ననూర్ గ్రామంలో చలివేంద్రం ప్రారంభం

● గ్రామ సర్పంచ్ చిట్టంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి

● సేవా స్ఫూర్తి - ఎండాకాలంలో ప్రజలకు ఊరట






**మిడ్జిల్, ఏప్రిల్10 (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలంలోని మున్ననూర్ గ్రామం లో బస్టాండ్ ఆవరణలో ఘనంగా చలివేంద్రం ప్రారంభం వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహాన్ని తీర్చే లక్ష్యంతో గ్రామ సర్పంచ్ చిట్టెంపల్లి సుజాత మల్లికార్జున్ రెడ్డి చలివేంద్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో గీతాంజలి, ఉపసర్పంచ్, గ్రామ వార్డు నెంబర్, చైర్మన్ ప్రారంభించారు. ఎంపిడిఓ మాట్లాడుతూ.. ప్రయాణికులకు వేసవిలో ఈ సేవ ఎంతో ఉపశమనం కలిగిస్తోంది. ఆయన సేవా భావాన్ని పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రశంసిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్థులు, మరియు ఇతరులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగ చిన్నారులకు ప్రతి ఒక్కరు ప్రేమ ఆదరణ ప్రోత్సాహం అందించాలి: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

● మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకున్న వరంగల్ ఎంపీ




**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 10 (నేటి దర్శిని బ్యూరో):** సమాజంలో ప్రతి ఒక్కరు మానసిక దివ్యాంగ చిన్నారులకు ప్రేమ, ఆదరణ ప్రోత్సాహం అందించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని కనకదుర్గ కాలనీలో ఎంపీ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తన జన్మదిన వేడుకలను మల్లికాంబ మనోవికాస కేంద్రానికి చెందిన మానసిక దివ్యాంగ చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.

ఈ సందర్భంగా చిన్నారులను ఆప్యాయంగా పలకరించిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య చిన్నారుల ఆరోగ్య పరిస్థితులు, చదువులు, వారి ఆసక్తులు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నారులకు స్వయంగా స్వీట్లు తినిపించి, వారితో సన్నిహితంగా మమేకమయ్యారు. చిన్నారులు తమ చేతులతో తయారు చేసిన కళాకృతులను ఎంపీ కి బహుమతిగా అందజేయగా, వాటిని స్వీకరించిన ఎంపీ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మానసిక దివ్యాంగ చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులు పాల్గొని ఎంపీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఆదివాసి సంస్కృతి పరిరక్షణే జాతి అస్తిత్వానికి మూలం: మంత్రి సీతక్క

- భద్రాచలం ఐటిడిఏలో ఘనంగా ఆదివాసి సాంస్కృతిక సమ్మేళనం
- 'కోయ ఇలవేల్పుల చరిత్ర' గ్రంథావిష్కరణ - గిరిజన సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్న వేడుక
- గిరిజనుల ఆచారాలు, ఆహారపు అలవాట్లు రాబోయే తరాలకు అందించాలి
- విద్య, వైద్యం, మౌలిక వసతులకు ప్రభుత్వం కట్టుబడి ఉంది







**భద్రాచలం, ఏప్రిల్ 10 (నేటి దర్శిని):** ఆదివాసి గిరిజన తెగల జీవన విధానం, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు మన పూర్వీకులు అందించిన అమూల్యమైన సంపద అని, వాటిని కాపాడి రాబోయే తరాలకు అందిస్తేనే దేశానికి మూలవాసులమనే భావనకు సార్థకత ఉంటుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం భద్రాచలం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవనంలో నిర్వహించిన ఆదివాసి సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని 'కోయ ఇలవేల్పుల చరిత్ర' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంప్రదాయ ప్రకారం ఆమెకు ఘన స్వాగతం పలికారు. చిన్నారుల సాంప్రదాయ నృత్యాలు, ప్రజాప్రతినిధుల పాల్గొనడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మంత్రి మాట్లాడుతూ రేల పాటలు, డోలు నాదాలు ఆదివాసుల ఐకమత్యానికి ప్రతీకలని పేర్కొన్నారు. గిరిజనుల కులదేవతలు, ఆచారాలు, సామాజిక వ్యవస్థ వారి చరిత్రను ప్రతిబింబిస్తాయని చెప్పారు. మారుతున్న కాలంలో కనుమరుగవుతున్న సంప్రదాయాలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు.

**గిరిజన మ్యూజియం -- సంస్కృతి పరిరక్షణకు కేంద్రబిందువు: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం**

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ.. గిరిజన సంస్కృతి ప్రత్యేకతను కాపాడేందుకు ఐటిడిఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మ్యూజియం కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. కోయ తెగ చరిత్రను గ్రంథ రూపంలో అందించడం సంతోషకరమన్నారు.

**విద్యతో గిరిజన విద్యార్థుల భవిష్యత్తు బలపడుతోంది: ఐటిడిఏ పీవో రాహుల్**

ఐటిడిఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ.. గిరిజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించడంతో విద్యార్థుల ఫలితాలు మెరుగుపడ్డాయని తెలిపారు. కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు, ఉన్నత విద్యకు ప్రోత్సాహం ద్వారా అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారని చెప్పారు.

**'ఆదివాసి వికాసరత్న' బిరుదుతో పీవో రాహుల్‌కు ఘన సత్కారం**

ఇలవేల్పుల చరిత్ర సేకరణలో ప్రత్యేక పాత్ర పోషించిన ఐటిడిఏ పీవోకు మంత్రి సీతక్క, ప్రజాప్రతినిధులు 'ఆదివాసి వికాసరత్న' బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

## మాజీ జెడ్పిటిసి కండె హరిప్రసాద్ మృతుడి కుటుంబానికి నగదు చేయూత....



**ఆమనగల్లు,ఏప్రిల్ 10(నేటి దర్శిని ప్రతినిధి):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు గుర్రం గుట్ట కాలనీలో గుగ్గిళ్ళ దత్తు గురువారం మృతి చెందడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఆమనగల్ మాజీ జడ్పీటీసీ కండే హరిప్రసాద్ వారి కుటుంబానికి ఆసరగా 3000 రూపాయల నగదును శుక్రవారం వారి కుటుంబానికి అందించారు. వారి పార్థివ దేహం పై పూలమాలలు వేసి వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాలాది శ్రీనివాసులు,నాగిళ్ల చంటి, పుల్లారెడ్డి వెంకటేష్,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ ఫోన్లతో అంగన్వాడి సెంటర్లలో సేవలు మెరుగుపరచాలి: ఎమ్మెల్యే



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 10 (నేటి దర్శిని బ్యూరో):** మహిళలు చిన్నారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంగన్వాడీ టీచర్లకు 117 స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా శిశువులకు పోషకాహారం అందించడం, ఆరోగ్య సేవలో అంగన్వాడి టీచర్ల పాత్ర కీలకమన్నారు .టెక్నాలజీతో సేవలు మెరుగుపరచాలని సూచించారు .ఈ సందర్భంగా చిన్నారులకు ఉచిత యూనిఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, అధికారులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

- కొత్త చట్టాలతో ఉపాధి కార్మికులకు ఇబ్బందులు: నారీ ఐలయ్య
- ధర్నాలకు కార్మికులు భారీగా పాల్గొనాలి: వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు



**నిడమనూరు, ఏప్రిల్ 10 (నేటి దర్శిని):** ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు రెండు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ ఐలయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 21, 22 తేదీలలో మండల కేంద్రాలలో నిర్వహించనున్న ధర్నాలను విజయవంతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.నిడమనూరు మండలం మారుపాక గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న నారీ ఐలయ్య మాట్లాడుతూ, విబిజి కొత్త చట్టం కారణంగా ఉపాధి హామీ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గతంలో ఉన్న అనేక సౌకర్యాలను తొలగించడం వల్ల కార్మికులు పనికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐ క్యాప్షన్ వచ్చినప్పుడే పనికి అనుమతించడం వంటి నిబంధనలు కార్మికులకు ఇబ్బందిగా మారాయని తెలిపారు.పని ప్రదేశాలలో కనీస త్రాగునీరు కూడా అందించడంలేదని, ఈ కొత్త విధానాలతో ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.గత మూడు నెలలుగా పని చేసిన కార్మికులకు ఇప్పటివరకు వేతనాలు చెల్లించకపోవడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల ఉపాధి హామీ పథకం భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆయన విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం నిధులను 90 శాతం నుంచి 60 శాతానికి తగ్గించిందని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు అవసరమని పేర్కొంటూ, ఈ నెల 21, 22 తేదీలలో జరగనున్న ధర్నాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కందుకూరు కోటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ నరసయ్య, మారుపాక గ్రామ ఉపాధి హామీ సంఘం అధ్యక్షుడు కోమటి సోమయ్య, కార్యదర్శి కోమటి కవిత, ఉపాధ్యక్షులు పోలబోయిన పద్మ, వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, కోశాధికారి కోమటి రామయ్య, సంఘం నాయకులు ఇస్లాం వెంకటేశం, ఆదిమల్ల పూలమ్మ, నక్క గోపయ్య, ఈగల జ్యోతి, చిత్రం సామ్రాజ్యం, నందికొండ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## యోగ సాధన తో మానసిక ప్రశాంతత: జిల్లా కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, ఏప్రిల్ 10(నేటి దర్శిని బ్యూరో):** యోగ సాధనతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖిలా వరంగల్ లోని చారిత్రక శిల్పాల మధ్య ప్రపంచ హోమియోపతి, ఆయుష్ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రదర్శనలో కలెక్టర్ పాల్గొని స్వయంగా ఆసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాను నిత్యజీవితంలో అలవర్చుకోవాలని అధికారులకు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలోవైద్య అధికారులు, సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## హయత్‌నగర్ స్మశాన వాటిక అభివృద్ధి పనులపై నవజీవన్ రెడ్డి సమీక్ష



**హయత్‌నగర్; ఏప్రిల్ 10 (నేటి దర్శిని):** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీలో ఉన్న హిందూ స్మశాన వాటికలో సుమారు రూ.6 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి శుక్రవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్మశాన వాటికలో జరుగుతున్న పనుల పురోగతి, నాణ్యతపై ఆయన సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. పనులు వేగవంతంగా మరియు నాణ్యతతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు.స్మశాన వాటికలో అంతర్గత రహదారులు, విద్యుత్ దీపాలు, తాగునీటి సదుపాయం, శుభ్రత నిర్వహణ, పారిశుద్ధ్య వసతులు తదితర సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్మశానాన్ని వినియోగించుకునే విధంగా సమగ్ర అభివృద్ధి జరగాలని ఆయన అన్నారు. అలాగే స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టడం ఎంతో ముఖ్యమని సూచించారు. అభివృద్ధి పనులు నిర్దేశిత గడువులో పూర్తి అయ్యేలా సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు.

# దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలు

- ప్రారంభించిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి




**ఎల్బీనగర్, ఏప్రిల్ 10 (నేటి దర్శిని):** ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో నూతన ఫాగింగ్ యంత్రాలను ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల దోమల పెరుగుదల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని "దోమలపై యుద్ధం" కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తన పిలుపు మేరకు అభిమానులు స్వంత నిధులతో ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి పలు కాలనీలలో సాయంత్రం వేళల్లో ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుచూపుతో చర్యలు తీసుకున్నామని, చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకును నివారించేందుకు డ్రోన్ సాంకేతికతను వినియోగించి ప్రయోగాత్మకంగా విజయవంతం చేసినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా, దోమల లార్వాను అరికట్టేందుకు గంబూజియా చేపలను చెరువుల్లో వదిలి, డ్రోన్ సాయంతో చేరుకోలేని ప్రాంతాల్లో మందులు పిచికారీ చేసినట్లు వివరించారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ఆరోగ్యంపై తగిన శ్రద్ధ చూపడం లేదని, చెరువుల్లో గుఱ్ఱపుడెక్క ఆకును తొలగించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నదని విమర్శించారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం వాకింగ్‌కు వెళ్లే ప్రజలు దోమల సమస్యతో భయాందోళనకు గురవుతున్నారని, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల భయం పెరుగుతోందని పేర్కొన్నారు. తన ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా ప్రభుత్వం స్పందించి ప్రతి డివిజన్‌కు ఒక ఫాగింగ్ యంత్రం కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్లు, ఎంటమాలజీ సిబ్బంది మరియు ఇతరులు పాల్గొన్నారు.

# తోట మహేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం




**చైతన్యపురి, ఏప్రిల్ 10 (నేటి దర్శిని):**
వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చైతన్యపురి డివిజన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బిఆర్ఎస్ పార్టీ చైతన్యపురి డివిజన్ అధ్యక్షులు శ్రీ తోట మహేష్ యాదవ్ ఆధ్వర్యంలో బాబు కాంప్లెక్స్ చౌరస్తా వద్ద ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు.ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో రహదారులపై ప్రయాణించే ప్రజలు, కార్మికులు, పాదచారులకు చల్లని తాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందని నాయకులు తెలిపారు. ప్రజలకు సేవ చేయడం తమ ముఖ్య లక్ష్యమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా చేపడతామని తోట మహేష్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీశైలం యాదవ్, రమేష్, రాజు, సాయి, మల్లేష్, శ్రీను, పీ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో వాసవి డైమండ్ షోరూం ఘనంగా ప్రారంభం

- మధుయాష్కి గౌడ్ చేతుల మీదుగా వాసవి గోల్డ్ షోరూం ప్రారంభం






**వనస్థలిపురం, ఏప్రిల్ 10 (నేటి దర్శిని):**
వనస్థలిపురం పనామా గోడౌన్స్ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన వాసవి డైమండ్ అండ్ గోల్డ్ షోరూం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో వ్యాపార రంగం విస్తరణకు ఇటువంటి ఆధునిక షోరూమ్‌లు తోడ్పడతాయని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఆభరణాలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వజీర్ ప్రకాష్ గౌడ్, చంపాపేట డివిజన్ అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, కర్మాన్ఘాట్ దేవాలయ డైరెక్టర్ కంచర్ల కవిత, నాయకులు భీమిడి రామకృష్ణారెడ్డి, పర్వతి గణేష్ రెడ్డి, పోచబోయిన సురేష్ యాదవ్, మణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు



**దుండిగల్, ఏప్రిల్10 (నేటి దర్శిని):**
దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డ్ మాజీ కౌన్సిలర్ శంకర్ నాయక్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి శంకర్ నాయక్ గారిని శాలువాతో సన్మానించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శంకర్ నాయక్ గారు ప్రజలకు అందించిన సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు కటకం విరేష్, అమర్ నాయక్, రవి నాయక్, ప్రభు తదితరులు పాల్గొన్నారు

# గుర్రంపోడులో వివాహ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బుసిరెడ్డి





**నల్గొండ జిల్లా, ఏప్రిల్ 10 (నేటి దర్శిని):**
నాగార్జునసాగర్ నియోజకవర్గం పరిధిలోని గుర్రంపోడు మండలంలో పలు వివాహ మరియు జన్మదిన వేడుకల్లో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ధర్వేశిపురం వేద ఫంక్షన్ హాల్-2లో బుడ్డారెడ్డి గూడెం గ్రామానికి చెందిన ఈరటి వెంకటేశం యాదవ్--పద్మ దంపతుల ఆహ్వానం మేరకు హాజరైన పాండు రంగారెడ్డి, వధూవరులు వినీత్ యాదవ్--ప్రభావతి దంపతులను ఆశీర్వదించారు. అదేవిధంగా ధర్వేశిపురంలోని శివసాయి ఫంక్షన్ హాల్‌లో పోచంపల్లి గ్రామానికి చెందిన వరికుప్పల శ్రీనివాస్--మనీషా దంపతుల కుమార్తె హారిక మొదటి జన్మదిన వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. గుర్రంపోడు మండల కేంద్రంలోని గాలి జంగయ్య ఫంక్షన్ హాల్‌లో జూనుతల గ్రామానికి చెందిన గుర్రం సత్తయ్య ముదిరాజ్--లక్ష్మమ్మ దంపతులు, అలాగే పోచంపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ--మల్లమ్మ దంపతుల ఆహ్వానం మేరకు జరిగిన వివాహ వేడుకలో పాల్గొని వధూవరులు ఉపేందర్ ముదిరాజ్--పూజలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాల్లో బుడ్డారెడ్డి గూడెం సర్పంచ్ సింగం బాలకృష్ణ యాదవ్, పోచంపల్లి సర్పంచ్ గుండెబోయిన కళావతి సత్యనారాయణ ముదిరాజ్, ఉప సర్పంచ్ మర్రిపెద్ది పిచ్చమ్మ పృథ్వి రాజ్ రెడ్డి, శ్రీరాంపల్లి ఉప సర్పంచ్ గజ్జల శివారెడ్డి, తిరుమలగిరి సాగర్ మండలం మాజీ వైస్ ఎంపీపీ దిలీప్ కుమార్ రెడ్డి, కొప్పోలు మాజీ సర్పంచ్ తిరుగుడు లింగారెడ్డి, పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ బద్రి యాదయ్య ముదిరాజ్, కొత్తపల్లి ప్యాక్స్ మాజీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస్ రెడ్డి, నాగెండ్ల కృష్ణారెడ్డి, ఐతగోని పరమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ నాయకుల ముందస్తు అరెస్టులు

**నిడమనూరు, ఏప్రిల్ 10 (నేటి దర్శిని):**
తెలంగాణ ముదిరాజ్ నాయకుల పిలుపు మేరకు నిర్వహించనున్న "హలో ముదిరాజ్ ఛలో గాంధీభవన్" ముట్టడి కార్యక్రమానికి ముందు నిడమనూరు మండలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న ముదిరాజ్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు.మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు అన్నెబోయిన కొండల్ ముదిరాజ్, అలాగే నిడమనూరు మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కొప్పుల శ్రీనివాసులు ముదిరాజును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని సొంత పూచికపై విడుదల చేశారు. ఈ




సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణలో ముదిరాజ్ సమాజానికి జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం వెంటనే సరిచేయాలని డిమాండ్ చేశారు. ముదిరాజులను BC-D వర్గం నుంచి BC-A వర్గంలోకి మార్చాలని, పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వ స్థాయిలో అధికారికంగా నిర్వహించాలని కోరారు.అదేవిధంగా, ముదిరాజ్ సమాజానికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధులు మరియు రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ పేరుతో విడుదల చేసిన నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఘటనతో మండలంలో ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు భద్రతా చర్యలను కట్టుదిట్టం చేశారు.

# పిల్లల బాల్య దశలో అంగన్వాడీ టీచర్ల పాత్ర కీలకం...

- అంగన్వాడీ టీచర్ల సేవలు మరువలేనివి ...
- మహిళలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్న ప్రజా ప్రభుత్వం ...
- అంగన్వాడీ పిల్లలకు ఉచిత యూనిఫార్మ్స్ పంపిణీ ...
- అంగన్వాడీ టీచర్లకు ఉచిత స్మార్ట్ ఫోన్లు....,

**(నేటి దర్శిని): హన్మకొండ**
సమీకృత కలెక్టరేట్ హనుమకొండ జిల్లా అంగన్వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు సమాజానికి అమూల్యమని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం , వరంగల్ పశ్చిమ నియోజకవర్గ




పరిధిలోని 117 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లను, అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఉచిత యూనిఫార్మ్స్ (బట్టలు) మన పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు శాసన మండలి సభ్యుడు శ్రీ బస్వరాజు సారయ్య , మేయర్ శ్రీమతి గుండు సుధారాణి , కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయ్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు , కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్ , పోతుల శ్రీమాన్ గార్లతో కలిసి పంపిణీ చేశారు...,ఈ సందర్భంగా మన ప్రియతమ నాయకుడు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 38,000 పైచిలుకు అంగన్వాడీ టీచర్లకు రూ. 54 కోట్ల వ్యయంతో స్మార్ట్‌ఫోన్లు అందిస్తున్నామని తెలిపారు.,అంగన్వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించి సంబంధిత శాఖ మంత్రి శ్రీమతి సీతక్క గారి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కార్పొరేటర్లు సంబంధిత శాఖ అధికారులు, RJD, సీడీపీఓ, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# పూలే జయంతి వేడుకలు విజయవంతం చేయాలి

- అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

**మందమర్రి ఏప్రిల్ 10:(నేటి దర్శిని):**
మందమర్రి పట్టణంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలకు ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాలతో పాటు అన్ని కుల సంఘాలు,రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కన్వీనర్ మొయ్య రాంబాబు, కాంగ్రెస్ సీనియర్



నాయకుడు సోత్కు సుదర్శన్ మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను పట్టణంలో ఘనంగానిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు.శనివారం ఉదయం 10:30 గంటలకు మందమర్రి మార్కెట్ ప్రధాన సెంటర్‌లో జయంతి కార్యక్రమం జరుగుతాయని తెలిపారు. అలాగే సాయంత్రం 6:30 గంటలకు మహాత్మ జ్యోతిరావు పూలే జీవిత చరిత్రపై రూపొందించిన చలనచిత్రాన్ని ప్రధాన మార్కెట్ సెంటర్ లో ప్రదర్శించనున్నామని తెలిపారు.పట్టణం లోని ప్రతీ ఒక్కరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండిల్ల శ్రీనివాస్, పాత వీరస్వామి,కనకం రవీందర్,నేరువట్ల శ్రీనివాస్,పల్లె నర్సింగ్, సుందిళ్ల రాజయ్య, అయిందాల సారయ్య, శనిగారపు కుమారస్వామి, మూడారం శేఖర్లు పాల్గొన్నారు.



సెగలు రేపుతున్న ఆషిక రంగనాథ్ హాట్ అందాలు

# వరుణ్ తేజ్ 'కొరియన్ కనకరాజు' నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమో!




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, దర్శకుడు మేర్లపాక గాంధీ కాంబినేషన్‌లో వస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'కొరియన్ కనకరాజు'. ఇండో-కొరియన్ నేపథ్యంలో హారర్-కామెడీ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఈ చిత్రంలోని మొదటి పాట 'కమ్సాహంనిదా' ప్రోమోను తాజాగా విడుదల చేయగా, దీనికి విశేష స్పందన లభిస్తోంది. సంగీత దర్శకుడు ఎస్. థమన్, వరుణ్ తేజ్ మరియు దర్శకుడు మేర్లపాక గాంధీ మధ్య సాగే ఫన్నీ సంభాషణలతో కూడిన ఈ ప్రోమో యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచింది. మెలోడీ కింగ్ సిద్ శ్రీరామ్ ఆలపించిన ఈ పూర్తి పాటను ఏప్రిల్ 11న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, స్టార్ కమెడియన్ సత్య కీలకమైన వినోదాత్మక పాత్రలో అలరించనున్నారు. కొరియా సంస్కృతికి మరియు లోకల్ క్యారెక్టర్ అయిన కనకరాజుకు మధ్య ఉన్న విచిత్రమైన సంబంధాన్ని దర్శకుడు మేర్లపాక గాంధీ తన మార్కు వినోదంతో వెండితెరపై ఆవిష్కరించబోతున్నాడు. ఇప్పటికే మేజర్ షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం, ఆఖరి షెడ్యూల్‌ను దక్షిణ కొరియాలోని అందమైన లొకేషన్లలో పూర్తి చేసుకోబోతుంది. యూవీ క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ, ప్రమోద్ మరియు విక్రమ్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ ఈ డిఫరెంట్ కథాంశంతో మళ్లీ హిట్ ట్రాక్ ఎక్కడం ఖాయమని అభిమానులు ఆశిస్తున్నారు. మనోజ్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తున్న ఈ సినిమాను 2026 వేసవి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# దసరాకు రిలీజ్ చేసేలా ఫౌజీ షూటింగ్ స్పీడ్




ఈ ఏడాది ఆరంభంలో రాజాసాబ్‌తో ఫ్లాప్ ఇచ్చిన రెబల్ స్టార్ ప్రభాస్.. ఇదే ఏడాదిలో సాలిడ్ హిట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాడు. ప్రభాస్ నుంచి 'ఫౌజీ' సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. సీతారామం తర్వాత దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సెకండ్ వరల్డ్ వార్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతోంది. ఇప్పటికే మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. అఫీషియల్‌గా ప్రకటించనప్పటికీ.. వచ్చే దసరాకు ఫౌజీని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. కానీ ఈ ఏడాది డిసెంబరు పోస్ట్‌పోన్ అయ్యే ఛాన్స్ ఉందనే టాక్ వినిపిస్తోంది. అయితే చిత్ర యూనిట్ మాత్రం ఈ సినిమాను ముందుగా అనుకున్న సమయానికే ప్రేక్షకులకు అందించాలని పట్టుదలతో ఉంది. ఇందుకోసం నిర్మాణ పనులను ముమ్మరం చేస్తూ ఏకకాలంలో షూటింగ్‌ను పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. షెడ్యూల్ ప్రకారం సినిమాను పూర్తి చేయడం కోసం మేకర్స్ 'సెకండ్ యూనిట్'ను కూడా రంగంలోకి దించినట్టుగా తెలుస్తోంది. ప్రస్తుతం ఒక వైపు ప్రధాన తారాగణంపై దర్శకుడు హను రాఘవపూడి అత్యంత కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, మరోవైపు ఈ సెకండ్ యూనిట్ సినిమాలోని యాక్షన్ ఎపిసోడ్స్‌ను షూట్ చేస్తోందట. ఇలా రెండు యూనిట్‌లతో పని చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, క్వాలిటీ విషయంలో కూడా ఎక్కడా రాజీ పడకుండా అవుట్‌పుట్ వస్తుందని టీమ్ భావిస్తోంది. కాబట్టి.. దసరాకు ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయినట్టే. కాకపోతే.. మేకర్స్ నుంచి ఈ విషయంలో అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



# అమాయకత్వంలోనే అందం


ఉప్పెన' తర్వాత నేను పూర్తిస్థాయి ప్రేమకథలో నటించలేదు. ఈ సినిమా ఆ లోటుని తీర్చింది. ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అవుతుంది' అని చెప్పింది కృతిశెట్టి. ఆమె ప్రదీప్ రంగనాథన్ సరసన నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. విఘ్నేశ్‌శివన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని నయనతార నిర్మించారు. ఈ సందర్భంగా గురువారం కృతిశెట్టి విలేకరులతో ముచ్చటించింది. ఇది 2040లో జరిగే కథ అని, ఈ ఫ్యూచరిస్టిక్ కాన్సెప్ట్ ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుందని చెప్పింది. 'ఈ తరంలో డబ్బులు లేకపోయినా ఫర్వాలేదు. కానీ ఫోన్ లేకుండా ఉండటం చాలా కష్టం. అలాంటి మనస్తత్వం కలిగిన అమ్మాయి పాత్రను పోషించాను. భవిష్యత్తులో ప్రేమ కూడా ఇన్సూరెన్స్‌లో భాగం కావొచ్చు. ఈ సినిమాలో ఆ కాన్సెప్ట్ ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది' అని చెప్పింది. ప్రేమ విషయంలో తాను మాత్రం సంప్రదాయ భావాల్ని ఇష్టపడతానని, 'సీతారామం' '96' వంటి ప్రేమకథలు తనకు ఫేవరేట్ అని, ప్రేమ తాలూకు అమాయకత్వంలోనే ఓ ఆందం ఉంటుందని, ఈ తరం ప్రేమకు తాను ఏమాత్రం కనెక్ట్ కాలేనని కృతిశెట్టి చెప్పింది.

# మైఖేల్ జాక్సన్ బయోపిక్ ట్రైలర్ విడుదల విడుదల




ప్రపంచవ్యాప్తంగా సంగీత ప్రియులు ఎంతగానో ఎదురుచూస్తున్న పాప్ రారాజు మైఖేల్ జాక్సన్ బయోపిక్ 'మైఖేల్' ఫైనల్ ట్రైలర్‌ను చిత్రయూనిట్ తాజాగా విడుదల చేసింది . ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో మైఖేల్ జాక్సన్ మేనల్లుడు జాఫర్ జాక్సన్ టైటిల్ రోల్ పోషిస్తుండగా, ట్రైలర్‌లో ఆయన బాడీ లాంగ్వేజ్, డ్యాన్స్ మూమెంట్స్ మరియు లుక్ అచ్చం మైఖేల్ జాక్సన్‌ను తలపిస్తుండటం విశేషం. దర్శకుడు ఆంటోయిన్ ఫుక్వా తెరకెక్కించిన ఈ ట్రైలర్‌లో 'బీట్ ఇట్', 'థ్రిల్లర్', 'బిల్లీ జీన్' వంటి ఐకానిక్ సాంగ్స్ ప్రదర్శనలతో పాటు, మైఖేల్ వ్యక్తిగత జీవితంలోని భావోద్వేగ అంశాలను, బాల్యంలో ఆయన ఎదుర్కొన్న సంఘర్షణలను మరియు వివాదాలను ఎంతో ఆకట్టుకునేలా చూపించారు. ఆస్కార్ విజేత గ్రాహమ్ కింగ్ నిర్మించిన ఈ చిత్రంలో కోల్‌మన్ డొమింగో, నియా లాంగ్, మైల్స్ టెల్లర్ వంటి హాలీవుడ్ ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషించారు. కేవలం ఒక సంగీత ప్రయాణంలా కాకుండా, ఒక లెజెండరీ స్టార్ జీవితంలోని ఎత్తుపల్లాలను ఆవిష్కరించే ఈ చిత్రంపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అన్ని హంగులతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

# వారణాసి కథ ఇదేనా?




షూటింగ్‌కు ముందే తన సినిమా కథల్ని రివీల్ చేస్తుంటారు అగ్ర దర్శకుడు రాజమౌళి. చాలా సినిమాల విషయంలో ఆయన ఇదే ఆనవాయితీని పాటించారు. అయితే 'వారణాసి' సినిమాకొచ్చేసరికి కథాంశం విషయంలో కాస్త గోప్యత పాటిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన గ్లోబ్‌ట్రాటర్ ఈవెంట్‌లో కథకు సంబంధించిన బేసిక్ లైన్‌ను మాత్రమే బయటపెట్టారు. టైమ్ ట్రావెల్ కథ ఇదని, రామాయణ ప్రస్తావన కూడా ఉంటుందని, ఓ ఎపిసోడ్‌లో హీరో మహేశ్‌బాబు రాముడి పాత్రలో కనిపిస్తాడనే వివరాల్ని వెల్లడించారు.అయితే అభిమానులు మాత్రం 'వారణాసి' అసలు కథేంటి అనే అన్వేషణలో పడ్డారు. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియాలో అనేక లీకులొస్తున్నాయి. తాజాగా ప్రముఖ హాలీవుడ్ విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ 'వారణాసి' కథ గురించి కొన్ని ఆసక్తికరమైన వివరాల్ని అందించింది. అద్భుతశక్తులు కలిగిన త్రేతాయుగం నాటి మహిమాన్విత విశ్వ కళాఖండాన్ని సాధించి, తద్వారా ప్రపంచ ఆధిపత్యాన్ని సాధించాలనే దురాలోచన చేస్తాడు క్రూరుడైన కుంభ (పృథ్వీరాజ్ సుకుమారన్). దాని సాధనకై శివ భక్తుడైన రుద్ర (మహేశ్‌బాబు)ను ఎంచుకుంటాడు. కుంభ (పృథ్వీరాజ్ సుకుమారన్) ఆదేశాల మేరకు టైమ్ ట్రావెల్ చేసి ఆ శక్తిని సాధించేందుకు పూనుకుంటాడు రుద్ర. ఈ క్రమంలో అతను కొన్ని పురాతన రహస్యాలతో పాటు ఓ చీకటి నిజాన్ని తెలుసుకుంటాడు. కుంభ ఓ కుట్రదారుడని, ప్రపంచ ఆధిపత్యం కోసమే తనను ఈ కాలయాత్రకు పురమాయించాడని అర్థం చేసుకుంటాడు.ఈ నేపథ్యంలో రామాయణ కాలంనాటి ఆ కళాఖండాన్ని పొందడానికి రుద్ర ఏం చేశాడు? కుంభ కుట్రల్ని ఎలా ఛేదించాడు? అన్నదే ఈ చిత్ర కథ అని సదరు విజువల్ ఎఫెక్ట్స్ సంస్థ తన కథనంలో పేర్కొన్నది. ఈ వార్తలో నిజమెంతో తెలియదు కానీ..సోషల్‌మీడియాలో మాత్రం తెగ వైరల్ అవుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న 'వారణాసి' ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.


**Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365**